క్లుప్తంగా

నియామకం



మొగుళ్లపల్లి: సమాచార హక్కు చట్టం పాత ఇస్సిపేట గ్రామ కన్వీనర్‌గా గడ్డం రాజమౌళిని నియమించినట్లు సహ చట్టం మండల అధ్యక్షుడు కమలాపురం విజేందర్ శుక్రవారం తెలి పారు. గ్రామ స్థాయిలో అవినీతి అక్రమాలు తావు లేకుండా అవినీతి పాలనకు అడ్డుకట్ట వేసేందుకు సమాచార హక్కు చట్టం ఒక ఆ యుధంగా పనిచేస్తుందన్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎన్నికైన నా రాజమౌళి మాట్లాడుతూ.. తన నియమాకానికి సహకరించిన మండల శాఖ అధ్యక్షుడు కమలాపురం విజేందర్‌కు జిల్లా కమిటీకి కృతజ్ఞతలు తెలిపారు.

పారిశుద్ధ్య పనులు



మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో పంచాయతీ కార్యదర్శి రాజు శుక్రవారం సిబ్బందితో పారిశుద్ధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామంలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని తొలగించారు. డ్రెయినేజీలను శుభ్రం చేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ.. గ్రామంలో సమస్యలు ఉంటే తమ దృష్టికి తీసుకొని వస్తే పరిష్కరిస్తామని తెలిపారు. కారోబార్ అజ్మత్ అలీ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటిపై కూలిన చెట్టు



ఏటూరునాగారం: మండలంలోని రామన్నగూడెం గ్రామంలో గురువారం రాత్రి కురిసిన గాలివానకు ఇంటిపై చెట్టు కూలి ఇల్లు నేల మట్టమైన ఘటన శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తుల కథనం ప్రకారం.. రామన్నగూడెం గ్రామానికి చెందిన బండారు నర్సింహులు ఇంటిపై గాలి వానకు నర్సింహులు ఇంటిపక్కన ఉన్న వేపచెట్టు కూలి ఇంటిపై పడి ఇల్లు నేల మట్టమైందని తెలిపారు. ఈ ప్రమాదంలో ఎలాంటి ప్రాణనష్టం జరగలేదు. ఇంట్లో ఉన్న వస్తువులు అన్ని ధ్వంసమయ్యాయని తెలిపారు.

యువతకు స్వయం ఉపాధి కల్పించాలి

ఎస్ఎస్‌తాడ్వాయి: మండలంలోని యువతకు స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేయాలని సీతక్క యువసేన జిల్లా అధ్యక్షుడు చర్పా రవీందర్ కోరారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర సంక్షేమ భవన్‌లో రాష్ట్ర ట్రైకార్ జనరల్ మేనేజర్ కుంజా శంకర్ రావును కలిసి రవీందర్ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ తమ పరిధిలో ఉన్న ట్రైకార్, గిరివికాస్, మైక్రో ఇండస్ట్రీ, ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ పథకాల కింద రుణాలు మంజూరు చేసి ఉపాధి కల్పించాలన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో ఎలాంటి స్వయం ఉపాధి రుణాలు ఇవ్వకుండా ఉండటం వలన యువత మొత్తం నిర్వీర్యం అయిందన్నారు. స్వయం ఉపాధి కోసం రుణాలు మంజూరు చేసి అభివృద్ధికి తోడ్పాటు అందించాలన్నారు.

షరతులు లేకుండా రుణమాఫీ చేయండి

ములుగు: రైతులకు ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్ఎస్ జిల్లా నాయకుడు భూక్యా జంపన్న కోరారు. ఈ సందర్భంగా ఆయన శుక్రవారం మాట్లాడుతూ 2024-25 సవత్సర బడ్జెట్‌లో వ్యవసాయానికి రూ.72,659 కోట్లు కేటాయించడాన్ని స్వాగతిస్తున్నట్లు తెలిపారు. ఇందులో రూ.2 లక్షల రైతు రుణమాఫీకి రూ.26 వేల కోట్లు, రైతు భరోసాకు రూ. 15 వేల కోట్లు రైతు బీమాకు కేటాయింపులు ఉన్నట్లు తెలిపారు. రుణమాఫీలో కొంతమంది రైతులకు మాఫీ కావడం లేదని రేషన్ కార్డు, పట్టాపాస్ పుస్తకం ఉన్న వారికి రుణమాఫీ వస్తుందన్నారు. ములుగు ఏజెన్సీలో 50 శాతం మంది రైతులకు పట్టాలు కాలేదని పహాణీల ద్వారానే బ్యాంకుల నుంచి రుణాలను తీసుకోవడం జరిగిందన్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

ములుగు: తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారుల ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ములుగు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రులు జూపల్లి కృష్ణారావు, సీతక్క చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ములుగు జిల్లా కాంగ్రెస్ నాయకులు బాదం ప్రవీణ్, కుక్కల నాగరాజు మాట్లాడుతూ గత పాలకులు ప్రకటనలే పరిమితమై కళాకారులను విస్మరించారన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి 30 శాతం పీఆర్‌సీ ఇచ్చి కళాకారుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు.

తల్లిపాలతో రోగనిరోధక శక్తి



పలిమెల: అవగాహన కల్పిస్తున్న అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివరాణి



టేకుమట్ల: గర్మిళ్లపల్లిలో..

టేకుమట్ల: తల్లిపాలతో పిల్లల్లో రోగనిరోధక శక్తి పెరుగుతుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సరోజన అన్నారు. శుక్రవారం గర్మిళ్లపల్లి అంగన్‌వాడీ సెక్టార్‌లో తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ర్యాలీ తీసి, తల్లిపాల ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. పుట్టిన ప్రతీ బిడ్డకు తల్లిపాలను పట్టించడం వల్ల రోగనిరోధక శక్తి వృద్ధి చెందడంతో పాటు, శారీరకంగా ఎదుగుదల ఉంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు పోషిని లావణ్య, విజయమ్మ, స్వరూప, అనూష, ఏఎన్ఎం మంజుల, ఆశ కార్యకర్తలు స్వప్న, రమ ఉన్నారు.

భూపాలపల్లి రూరల్: పిల్లలకు తల్లిపాలు పట్టించడం వలన ఆరోగ్యంగా ఉంటారని 16వ వార్డు కౌన్సిలర్ దాట్ల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం రాంనగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కౌన్సిలర్ శ్రీనివాస్ హాజరై పిల్లలకు అక్షరాభ్యాసం చేయించారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ అవంతిక, అంగనవాడీ సూపర్‌వైజర్ రాజేశ్వరీ, అంగన్‌వాడీ టీచర్లు ఉమామహేశ్వరి, అరుణ పాల్గొన్నారు



భూపాలపల్లి రూరల్: అక్షరాభ్యాసం చేయిస్తున్న కౌన్సిలర్ శ్రీనివాస్

పలిమెల: అప్పుడే పుట్టిన బిడ్డకు ముర్రుపాలు పట్టించడంతో పాటు ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు తాపించడం ద్వారా పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి మెరుగుపడుతుందని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శివరాణి తెలిపారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పలిమెల అంగన్‌వాడీ సెంటర్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో గర్భిణులకు, తల్లులకు సూపర్‌వైజర్ శివరాణి తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సుశీల, సత్యవతి, కిష్టబాయి, భారతి, శారద పాల్గొన్నారు.

తల్లిపాలతో పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యం

రేగొండ: తల్లి పాలు పిల్లలకు సంపూర్ణ ఆరోగ్యమని అంగన్‌వాడీ కొడవటంచ క్లస్టర్ సూపర్‌వైజర్ సామల సుజాత అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండలంలోని కొడవటంచ గ్రామంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన వెంటనే గంటలోపు తల్లిపాలు పట్టించాలని తెలిపారు. గర్భిణులు, బాలింతలు ఆకుకూరలు, కూరగాయాలు, పండ్లు ప్రతి రోజు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు కల్పన, లలిత, రమ, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: పుట్టిన బిడ్డకు తల్లిపాలే ముఖ్యమని సూపర్‌వైజర్ రజిత అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని అంగన్‌వాడీ సెంటర్లలో తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మొదటి ఆరు నెలలు నిండే వరకు తల్లిపాలు మాత్రమే తాగించాలని, ఏడు నెలల నుంచి రెండు సంవత్సరాల లోపు తల్లిపాలను కొనసాగిస్తూ అదనపు ఆహారాన్ని ఇవ్వాలన్నారు. అందరూ వ్యక్తిగత పరిశుభ్రతను, పరిసరాల పరిశుభ్రతను పాటించినప్పుడు ఎలాంటి అంటువ్యాధులు రాకుండా ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు వెన్నెల, రజిత, అంగన్‌వాడీ ఆయాలు, గర్భిణులు, బాలింతలు, పిల్లలు పాల్గొన్నారు.

కాటారం: మండలంలోని అల్లీపూర్, ధన్వాడ అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం తల్లిపాల వారోత్సవాలు, హ్యాండ్‌వాష్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై గర్భిణులు, బాలింతలు, మహిళలకు అంగన్‌వాడీ టీచర్లు ముస్కుల శ్రీలతరెడ్డి, కారెంగుల శ్రీలత అవగాహన కల్పించారు. తల్లిపాలతో శిశువుకు మంచి పౌష్టికాహారం అంది ఆరోగ్యంగా, బలంగా ఎదుగుతారని తెలిపారు. అల్లీపూర్ అంగన్‌వాడీ కేంద్రంలో విద్యార్థులకు హ్యాండ్ వాష్‌పై అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ టీచర్ రజిత, గర్భిణులు, బాలింతలు, గ్రామస్తులు పాల్గొన్నారు.



కాటారం: ధన్వాడలో..



మొగుళ్లపల్లిలో..



రేగొండ: కొడవటంచలో..

గుడుంబాకు బానిస కావొద్దు



గ్రామస్తులతో మాట్లాడుతున్న సీఐ రాంచందర్‌రావు

పలిమెల: గుడుంబాకు బానిసై ప్రజలు జీవితాలను నాశనం చేసుకోవద్దని మహదేవ్‌పూర్ సీఐ రాంచందర్‌రావు గ్రామస్తులకు సూచించారు. మండలంలోని పంకెన గ్రామంలో పలిమెల పోలీసులు, అబ్కారీ శాఖ సంయుక్తంగా శుక్రవారం తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురి ఇళ్లల్లో సుమారు 200 లీటర్ల గుడుంబా పానకాన్ని, 40 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం సీఐ మాట్లాడుతూజజ చెడు వ్యసనాలకు ప్రజలు దూరంగా ఉండాలని అన్నారు. గుడుంబాని తయారు చేసిన, సరఫరా చేసిన, అమ్మిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. అలాగే గ్రామంలోకి కొత్తగా, అనుమానస్పదంగా ఎవరైనా వ్యక్తులు వచ్చిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులను గోదావరి దాటించొద్దని సూచించారు. ఈ తనిఖీల్లో ఎస్సై తమాషారెడ్డి, ఎక్సైజ్ కానిస్టేబుల్ కోటేష్, సివిల్ కానిస్టేబుళ్లు క్రాంతికుమార్, శ్రావణ్, టీఎస్ఎస్‌పీ సిబ్బంది పాల్గొన్నారు.

సంఘవిద్రోహ శక్తులకు ఆశ్రయం ఇవ్వొద్దు



వాహనాలను తనిఖీ చేస్తున ఎస్సై ప్రసాద్

టేకుమట్ల: సంఘవిద్రోహ శక్తులకు ఎవరూ ఆశ్రయం కల్పించవద్దని ఎస్సై గొగికారి ప్రసాద్ అన్నారు. శుక్రవారం మండలంలోని ద్వారకపేట శివారులో వాహనాలు తనిఖీ చేపట్టారు. అలాగే ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మావోయిస్టు వారోత్సవాల సందర్భంగా ముమ్మరంగా తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. మండలంలో ఎవరికైనా కొత్త వ్యక్తులు కనబడితే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. ఆయన వెంట పోలీస్ సిబ్బంది మహేందర్, వెంకటేష్, నాగరాజ్, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ జెండా ఎగురవేయాలి



మొగుళ్లపల్లి: సమావేశంలో పాల్గొన్న నాయకులు

మొగుళ్లపల్లి: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ జెండా ఎగురవేయాలని ఆ పార్టీ రాష్ట్ర క్రమశిక్షణ సంఘం సభ్యుడు నాగపురి రాజమౌళిగౌడ్ అన్నారు. మండల కేంద్రంలోని అమ్మ గార్డెన్‌లో శుక్రవారం కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా నాగపురి రాజమౌళిగౌడ్ మాట్లాడుతూ.. మండలంలో రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మెజారిటీ స్థానాలు గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ మోరె రవీందర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి, కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోల్సాని తిరుపతిరావు, నాయకులు జన్నె మొగిలి, మాజీ జెడ్పీటీసీ కుమ్మరి సారయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ తిరుపతిరావు, తిరుపతి, వేణుగోపాల్‌రెడ్డి, బండారి శ్రీనివాస్, పెండ్లి మల్లారెడ్డి, చింతకింది రాజేశం, రాస భిక్షపతి గూడూరి మహిపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మల్హర్: మండలంలోని తాడిచర్ల గ్రామంలో బీజేపీ మండల అధ్యక్షుడు ముడతనపల్లి ప్రభాకర్ ఆధ్వర్యంలో శుక్రవారం బీజేపీ మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా బీజేపీ మంథని అసెంబ్లీ కన్వీనర్ మల్క మోహన్‌రావు మాట్లాడుతూ.. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ బలపరిచిన అభ్యర్థుల గెలుపు కోసం నాయకులు, కార్యకర్తలు కష్టపడి పని చేయాలని పిలుపు ఇచ్చారు. ప్రజా సమస్యలపై దృష్టి సారించి బలమైన ప్రతిపక్ష పార్టీగా ప్రజల తరుపున పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి నాగరాజు, అధికార ప్రతినిధి చొప్పరి రాజు, షేక్ నిషాన్ పాషా, రాజయ్య, గణేష్, రమేష్, శ్రీకాంత్, రాజయ్య, రాజు పాల్గొన్నారు.

డేంజర్ జోన్‌లోని ఇళ్లు సేకరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

మల్హర్: ఓపెన్ కాస్ట్‌కు 500 మీటర్ల పరిధిలోని మండలంలోని పెద్ద తాడిచర్ల డేంజర్ జోన్‌లో ఉన్న ఇళ్లను సేకరించి, పునరావాసం కల్పించాలని బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండలంలోని తాడిచర్లలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ నాయకులు మాట్లాడారు. మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు జెన్‌కో సీఎండీ వద్దకు నిర్వాసితులను తీసుకెళ్లి డేంజర్ ఇళ్ల సేకరణకు పరిహారం అనుమతులు తీసుకవచ్చారని పేర్కొన్నారు. మాజీ ఎంపీటీసీ రావుల కల్పన ఆధ్వర్యంలో గత ఫిబ్రవరి నెలలో నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని నిర్వాసితులతో కలసి శాంతియాత ఆందోళన కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. దీంతో జెన్‌కో అధికారులు జూన్‌లోగా పరిహారం చెల్లిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఇంత వరకు దాని ఊసే లేదు అని ఆరోపించారు. ఇప్పటికైన అధికారులు ఇళ్లను సేకరించి, నిర్వాసితులకు పరిహారం చెలించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ గోనె శ్రీనివారావు, మాజీ ఎంపీటీసీ రావుల కల్పన, బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు మధుసూదన్‌రావు, భూనిర్వాసితులు అక్కపాక సమ్మయ్య, బబ్బిలి రాజయ్య, బబ్బిలి రమేష్, తాండ్ర మల్లేష్, ఆర్ని సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరం



వైద్య శిబిరం ప్రారంభిస్తున్న సీఐ నాగార్జునరావు

కాటారం: శరత్ మ్యాక్స్ విజన్ సూపర్ స్పెషాలిటీ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని జయ ఆప్టికల్స్‌లో శుక్రవారం ఉచిత కంటి వైద్యశిబిరం నిర్వహించారు. సీఐ నాగార్జునరావు ఈ శిబిరాన్ని ప్రారంభించి అందుతున్న సేవలపై ఆరా తీశారు. మారుమూల నిరుపేద ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించాలనే ఉద్దేశ్యంతో శిబిరం నిర్వహించడం అభినందనీయం అన్నారు. సుమారు వంద మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు కంటి వైద్య నిపుణులు డాక్టర్ లింగమూర్తి తెలిపారు. శరత్ మ్యాక్స్ విజన్ ఆస్పత్రి వైద్యులు పాల్గొన్నారు.

ఫొటోగ్రఫీ అకాడమీ అవార్డుకు ఎంపిక



ఫొటోగ్రాఫర్ రాజు



కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రానికి చెందిన ఫొటోగ్రాఫర్ పంతకాని రాజు తెలంగాణ ఫొటోగ్రఫీ అకాడమీ అవార్డుకు ఎంపికయ్యాడు. తెలంగాణ ఫొటోగ్రఫీ అకాడమీ నిర్వహించిన ఫొటోగ్రఫీ కాంపిటేషన్‌లో ఉత్తమ ఛాయా చిత్రం అవార్డుకు ఎంపిక నిర్వహించారు. ఒరిస్సా గిరిజన తెగ 'బొండా' మహిళల జీవన సంస్కృతి, సాంప్రదాయాలపై రాజు తీసిన ఛాయాచిత్రానికి ఈ అవార్డు లభించింది. దేశంలోని 125 మంది నిష్ణాతులైన ఫొటోగ్రఫీ కళాకారులు తీసిన 600 ఛాయాచిత్రాలు పోటీలో ఉండగా తాను తీసిన ఛాయాచిత్రం ఈ అవార్డుకు ఎంపిక కావడం చాలా సంతోషంగా ఉందని రాజు తెలిపారు. తనను ఎంపిక చేసిన తెలంగాణ ఫొటోగ్రఫీ అకాడమీ ప్రెసిడెంట్ రావులపల్లి సునీత, వైస్ ప్రసిడెంట్ సంపత్ కుమార్, అకాడమీ కార్యదర్శి బండి రమణకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఆగస్టు 19 అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా తెలంగాణ ఫొటోగ్రఫీ అకాడమీ అందుకోనున్నట్లు ఆయన తెలిపారు.

తపాలాశాఖ పథకాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అనంతరామ్‌నాయక్

మొగుళ్లపల్లి: మండలంలోని మెదరమెట్ల గ్రామంలో తపాలాశాఖ ఆధ్వర్యంలో గ్రామీణ తపాలా జీవిత పథకాల గురించి ఆ శాఖ పరకాల సబ్ డివిజన్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ అనంత రామ్ నాయక్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తపాలా శాఖ ద్వారా అందజేస్తున్న సేవలను ప్రజలందరూ వినియోగించుకుని లబ్ధి పొందాలన్నారు. అధిక వడ్డీ పొదుపు పథకాల గురించి వివరించారు. పేద, మధ్య తరగతి ప్రజలకు పొదుపు మేలు చేస్తుందన్నారు. మొగుళ్లపల్లి ఎస్‌పీఎం మల్లేశ్, ఎంఓ సంతోష్, బీపీఎం, అంగన్‌వాడీ టీచర్లు, ఆశ కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి



కాటారం: పొలంబాట నిర్వహిస్తున్న అధికారులు



మల్హర్‌లో..

కాటారం: విద్యుత్ సమస్యల సత్వర పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు ట్రాన్స్‌కో ఏడీఈ నాగరాజు తెలిపారు. మండలంలోని గంగారం, గట్లకుంట గ్రామాల్లో శుక్రవారం ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో విద్యుత్‌శాఖ పొలంబాట కార్యక్రమాన్ని నిర్వహించారు. పంట పొలాల్లోని రైతుల వద్దకు వెళ్లిన అధికారులు విద్యుత్ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ లైన్లను పరిశీలించారు. లూస్ లైన్స్, లీన్డ్ పోల్స్ సరిచేస్తున్నట్లు వివరించారు. రైతులకు ఏవైన విద్యుత్ సమస్యలు ఎదురైతే వెంటనే సమాచారం అందించాలని ఏడీఈ కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఈ మేఘనాథ్, లైన్ ఇన్‌స్పెక్టర్ కిరణ్, లైన్‌మెన్లు శంకర్, ఉస్మాన్, ప్రవీణ్, తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ తీగలకు మరమ్మతులు

మల్హర్: మండలంలోని మల్లారం గ్రామ పంచాయతీ పరిధిలోని దబ్బగట్టులో పొలం బాట కార్యక్రమంలో భాగంగా పొలాల్లోని విద్యుత్ తీగలకు శుక్రవారం విద్యుత్ శాఖ అధికారులు మరమ్మతులు చేపట్టారు. ఈ సందర్భంగా పాడైపోయిన ఎల్‌టీపీన్ ఇన్సలేటర్‌లను రీప్లేస్‌మెంట్ చేశారు. అలాగే లూజైన విద్యుత్ తీగలను సరి చేశారు. కాటారం విద్యుత్ శాఖ ఏడీ నాగరాజు, కొయ్యూరు ఏఈ సంపత్, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'డబుల్' ఇళ్లు పంపిణీ చేయాలి

భూపాలపల్లి రూరల్: జిల్లా కేంద్రంలో నిర్మించిన 462 డబుల్ బెడ్‌రూం ఇళ్లను నేడు (శనివారం) భూపాలపల్లికి వస్తున్న మంత్రుల చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేయాలని ధర్మసమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు కొత్తూరు రవీందర్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రవీందర్ మాట్లాడుతూ.. అప్పటి బీఆర్ఎస్ పార్టీ నాయకులు 392 మంది లబ్ధిదారులకు గుర్తించి అందులో ముగ్గురికి పట్టాలు ఇచ్చి చేతులు దులుపుకున్నారన్నారు. అప్పటి నుంచి గత కలెక్టర్‌కు మున్సిపల్ కమిషనర్‌లకు విన్నవించిన పట్టించుకోవడం లేదని ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్ రూంలు పంపిణీ చేసి చిత్త శుద్ధిని చాటుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు చిట్యాల శ్రీనివాస్, దశరథం, ప్రసాద్, రవి, అనిల్ పాల్గొన్నారు.

సుప్రీంకోర్టు తీర్పుపై నాయకుల హర్షం



భూపాలపల్లి రూరల్: సంబురాల్లో పాల్గొన్న జాంబవ కుల సంక్షేమ సంఘం నాయకులు

భూపాలపల్లి రూరల్: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు తీర్పు ఇవ్వడంతో జిల్లాలో కేంద్రంలోని ఎమ్మార్పీఎస్ నాయకులతో పాటు, ఎస్సీ సంఘాల నాయకులు శుక్రవారం హర్షం వ్యక్తం చేస్తు సంబురాలు చేసుకున్నారు. సుభాస్ కాలనీకి చెందిన జాంబవ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నాయకులు అంబేద్కర్ సెంటర్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి, కేక్ కట్ చేశారు. ఈ కార్యక్రమంలో జాంబవ కుల సంక్షేమ సంఘం అధ్యక్షుడు మచ్చ భద్రయ్య, నాయకులు కొడెపాక శంకర్, కలువల రాజమౌళి, పుల్యాల తిరుపతి, మహేష్, ఆరెల్లి రాజం, మచ్చవిష్ణు పాల్గొన్నా రు. అలాగే ఎమ్మార్పీఎస్ రాష్ట్ర సీనియర్ నాయకులు మొలుగూరి రవీందర్ ఆధ్వర్యంలో పట్టణంలో నిశాంతినగర్ కాలనీలో సంబురాలు జరుపుకున్నారు.

టేకుమట్ల: ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పును హర్షిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అడహక్ కమిటీ మండల అధ్యక్షుడు ఆరకొండ రాజయ్య ఆధ్వర్యంలో అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు మల్లయ్య అంబేద్కర్ విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో జన్నె యుగేందర్, మల్లేశ్, కొమురయ్య, వీరయ్య, రాములు, సారయ్య, దామోదర్, కోటగిరి సతీష్‌గౌడ్, రామకృష్ణ గౌడ్, నరేష్, దేవేందర్‌రావు పాల్గొన్నారు.

మొగుళ్లపల్లి: సుప్రీ కోర్టు తీర్పుపై హర్షిస్తూ శుక్రవారం మండల కేంద్రంలో ఎంఎస్ఎఫ్, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలభిషేకం నిర్వహించారు. ఎంఎస్ఎఫ్ మండల అధ్యక్షుడు అంతడుపుల సారంగపాణి, జిల్లా నాయకులు శ్రీనివాస్, బండారి రాజు, ప్రభాకర్, రమేష్, దూడపాక జలందర్ పాల్గొన్నారు.

మల్హర్: ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు ఎంతో హర్షనీయమని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధానక కార్యదర్శి, మండల అధ్యక్షుడు కేసారపు నరేష్ అన్నారు. ఎస్సీ వర్గకరణపై సుప్రీంకోర్టు అనూకలంగా తీర్పు ఇచ్చిన నేపథ్యంలో ఎమ్మార్పీస్ నాయకులు మండలంలోని తాడిచర్లలో మంద కృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. నాయకులు సమ్మయ్య, మల్లేశ్, సమయ్య, సతీష్, ప్రభాకర్, నవీన్, రాజయ్య, సాత్విక్, బాలయ్య, రాజేష్, అరుణ్, కుమార్, హేమంత్ పాల్గొన్నారు.



మల్హర్: కేక్ కట్ చేస్తున్న నాయకులు



టేకుమట్ల: సంబురాల్లో ఏఐఎస్ నాయకులు



మొగుళ్లపల్లిలో..

వ్యాధులపై అప్రమత్తత అవసరం



పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యుడు విష్ణువర్ధన్

రేగొండ: వ్యాధులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందని పీహెసీ వైద్యుడు విష్ణువర్ధన్ అన్నారు. మండలంలోని పెద్దంపల్లి గ్రామంలో శుక్రవారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. సుమారు వంద మందికి పైగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పరిసరాల పరిశుభ్రతతో పాటు, వ్యక్తిగత శుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ లింగారెడ్డి, ఏఎన్ఎం యాదలక్ష్మీ, పంచాయతీ కార్యదర్శి కుమారస్వామి, ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.